దివ్యాంగులతో చెలగాటం

కూటమి ప్రభుత్వం దివ్యాంగుల జీవితాలతో చెలగాటమాడుతోంది. అనర్హత పేరుతో పింఛన్లను రద్దు చేసింది. నడవడానికి వీల్లేని వారి పింఛన్లను సైతం రీ వెరిఫికేషన్ పేరుతో తొలగించింది. గుడిపాల మండలంలో 187 మంది దివ్యాంగులు పింఛన్లకు దూరమయ్యారు. రీ వెరిఫికేషన్‌లో వైద్యులు ఇష్టారీతిన పర్సంటేజీలు ఇవ్వడంతోనే ఈ పరిస్థితి నెలకొందని విమర్శలు వస్తున్నాయి. పదేళ్లుగా పింఛన్లు తీసుకుంటున్న దివ్యాంగులను కూడా అనర్హులుగా ప్రకటించడంపైనా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- నోటికాడ ముద్ద లాగేసిన సర్కార్
- ఒక్కో మండలంలో 100కు పైగా పింఛన్ల రద్దు
- కదల్లేని వారు సైతం అనర్హులని ప్రకటించిన వైనం
- పింఛన్ల అప్పీలకు కార్యాలయాలకు పరుగులు తీస్తున్న దివ్యాంగులు


దివ్యాంగులను పరీక్షిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: అలవిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలపైనా కత్తి కట్టింది. విద్యుత్ చార్జీలు ఎడాపెడా పెంచేసింది. ఇప్పుడు దివ్యాంగులపై పడింది. ఒక్క కొత్త పింఛనును మంజూరు చేయకపోగా ఉన్న పింఛన్లను ఇష్టం వచ్చినట్లు తొలగించింది. దివ్యాంగుల పింఛన్లను తొలగించి వారి నోటికాడ కూడు లాగేసింది. నడవడానికి వీలులేని వారు, కాళ్లు, చేతులు వంకరపోయి ఏ పనీ చేసుకోలేని వారి పింఛన్లను సైతం రీ వెరిఫికేషన్ పేరుతో నిర్దాక్షిణ్యంగా రద్దు చేసింది. గుడిపాల మండలంలో 801 మంది దివ్యాంగ పింఛన్‌దారులు. 53 మంది ఆరోగ్య పింఛన్‌దారులు వున్నారు. ఇటీవల రీవెరిఫికేషన్‌లో 187 మంది దివ్యాంగులను అనర్హులుగా గుర్తించినట్లు అధికారులు ప్రకటించారు. వీరి పింఛన్లను రద్దు చేసి మళ్లీ అప్పీల్ చేసుకోవాలని చెప్పారు. ఇందులో రూ.15 వేలు తీసుకుంటున్న వారికి రూ.6 వేలకు తగ్గించారు. రూ.6 వేలు తీసుకుంటున్న వారిలో కొంతమందికి పూర్తిగా పింఛన్ రద్దు చేయగా, మరికొంతమందికి రూ.4 వేలు ఇస్తామని ప్రకటించారు.

ఇష్టారాజ్యంగా పరీక్షలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దివ్యాంగుల వైకల్యంపై రీ వెరిఫికేషన్ చేపట్టింది. వైద్యులు ఇష్టారాజ్యంగా పరీక్షలు చేసి తక్కువ పర్సంటేజీలు ఇవ్వడంతో ఎంతో మంది అర్హులకు అన్యాయం జరిగింది. కనీసం వికలాంగులన్న కనికరం కూడా లేకుండా పింఛన్లు తొలగించారని వారు వాపోతున్నారు.

నిశితంగా పరిశీలిస్తున్నాం

బొమ్మసముద్రం డాక్టర్ రష్మిత శుక్రవారం గుడిపాల ఎంపీడీవో కార్యాలయంలో దివ్యాంగులను పరిశీలించారు. గతంలో వున్న లోపాలు, ప్రస్తుతం వారి కదలికల్లో వున్న తేడాను గమనించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తానని పేర్కొన్నారు.


● ఇతని పేరు జయచంద్ర. గుడిపాల మండలంలోని సీఎం ఖండిగ గ్రామానికి చెందిన వారు. పుట్టుకతోనే చేయి వంపు ఉండడంతో పాటు పక్షవాతానికి గుయ్యాడు. పళ్లు కూడా లేవు. కాళ్లు కూడా వంకరగా ఉన్నాయి. రూ.15 వేలు వస్తున్న పింఛనును రూ.6 వేలకు కుదించారు. రీవెరిఫికేషన్ కోసం ఎంపీడీవో కార్యాలయానికి వచ్చాడు. అతని బాధలను డాక్టర్ రష్మితకు తెలియజేశారు. కచ్చితంగా న్యాయం చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

రీ వెరిఫికేషన్‌కు పిలిపించాం

దివ్యాంగులను రీ వెరిఫికేషన్‌కు పిలిపించాం. రీవెరిఫికేషన్‌లో డాక్టర్లు పరిశీలించి నివేదికలు అందజేస్తారు. వాటి ఆధారంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి తిరిగి జిల్లా కేంద్రానికి పంపిస్తాం. అందులో అర్హులుగా ఉన్న దివ్యాంగులకు యధావిధిగా పింఛన్లను అందజేస్తాం.

– శిరీష, ఎంపీడీవో, గుడిపాల



క్లుప్తంగా

గుడిపాలకు చేరిన యూరియా


వసంతాపురం సచివాలయానికి చేరిన యూరియా

గుడిపాల: ఎట్టకేలకు గుడిపాలకు యూరియా చేరింది. యూరియా లేకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. కొంతమంది రైతన్నలు తమిళనాడు నుంచి అత్యధిక ధరకు తీసుకువచ్చి పొలాల్లో చల్లుతున్నారు. ఈ నేపథ్యంలో గుడిపాల మండలంలోని వసంతాపురం సచివాలయానికి 300 బస్తాల యూరియా వచ్చింది. వీటిని రెండు రోజుల్లో రైతులకు అందజేస్తామని వ్యవసాయాధికారి సంగీత తెలిపారు. ఒక్కో రైతుకు ఒక బస్తా మాత్రమే ఇస్తామని వెల్లడించారు.

యాదమరికి 13 టన్నులు

యాదమరి: మండలానికి 13 టన్నుల యూరియా వచ్చిందని మండల వ్యవసాయ శాఖ అధికారిణి దీప చెప్పారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో మాట్లాడారు. ఒక్కో రైతు సేవా కేంద్రానికి 15 బ్యాగుల చొప్పున కేటాయిస్తామన్నారు. డిమాండ్ దృష్ట్యామరో 50 టన్నులు త్వరలోనే వస్తుందన్నారు. యూరియా వినియోగాన్ని రైతులు తగ్గించాలని, అందుకు ప్రత్యామ్నాయం వైపు దృష్టి పెట్టాలని కోరారు. అయితే తమకు అవసరం మేరకు యూరియా ఇవ్వకపోవడం లేదని పలువురు రైతులు అసహనం వ్యక్తం చేశారు.

రోడ్డుపై ఇసుక కుప్పలు


చెన్నై–బెంగళూరు రహదారిలోని గుడిపాల పెట్రోల్ బంక్ వద్ద పేరుకుపోయిన ఇసుక

గుడిపాల: మండలంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిలోని గుడిపాల పెట్రోల్ బంక్, మద్రాస్ క్రాస్ రోడ్డు సమీపంలో రోడ్డుపై ఇసుక కుప్పలు ఉండడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నాయి. గాలికి ఇసుక లేచి వాహనదారుల కళ్లల్లో పడుతుండడంతో కింద పడి గాయపడుతున్నారు. అధికారులు స్పందించి ఇసుకను తొలగించాలని కోరుతున్నారు.

తుమ్మిందలో బైక్ చోరీ

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఇంటిముందు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. చిత్తూరు మండలం తుమ్మింద గ్రామానికి చెందిన నరేష్‌కుమార్ బైక్‌ను ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఈ వాహనాన్ని చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎస్టీవో కార్యాలయంలో విచారణ


పలమనేరు ఎస్టీవో కార్యాలయంలో విచారణ చేస్తున్న అధికారులు

పలమనేరు: ఎస్టీవో కార్యాలయంలో ఉద్యోగి తీరు, కార్యాలయంలో జరుగుతున్న వ్యవహారాలపై జిల్లా ట్రెజరీ శాఖ అధికారుల ఆదేశాలతో శుక్రవారం కార్యాలయ అధికారి కేటీ వాసుదేవన్ విచారణ చేపట్టారు. ఇక్కడి కార్యాలయంలో ఫార్మ్ 16కి సంబంధించి ఒక సంఘం నేత ఎక్కువ మందివి తీసుకున్నారని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై సాక్షి దినపత్రికలో గత నెల 25న ఎస్టీవోపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో అధికారులు విచారణ చేపట్టారు. గతంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతపై ఒక ఉద్యోగి దురుసుగా వ్యవహరించడంతోపాటు ఏకవచనంతో సంబోధించారని, వారించిన ఎస్టీవోను బూతులు తిట్టి తాను లోకల్ అని, ఎవరూ ఏమీ చేయలేరని మాట్లాడినట్టు తేలింది. ఫామ్–16 అందజేతలో అక్రమాలు జరగలేదని అధికారులు తెలుసుకున్నారు. ఈ విషయాలపై పలుశాఖలకు చెందిన సంఘాల నేతలతో మాట్లాడారు. ఈ కార్యాలయంలోని ఓ అధికారి నిర్వాకం వల్లే వివాదాలు చోటు చేసుకుంటున్నట్టు తెలిసింది. ఆయనపై ఎలాంటి శాఖాపరమైన చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే. ఇందులో ఎస్టీవో కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పట్టు రైతులకు అవగాహన

పెద్దపంజాణి: మండలంలోని బొమ్మరాజుపల్లిలోని రైతు సేవా కేంద్రంలో శుక్రవారం సెంట్రల్ సిల్క్ బోర్డు అధికారులు నాపట్టు నా అభిమానం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టు రైతులకు అవగాహన కల్పించారు. సిల్క్ బోర్డు శాస్త్రవేత్త భరత్‌కుమార్ మాట్లాడుతూ పట్టు పురుగుల పెంపకం, రోగాల నుంచి కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అసిస్టెంటు డైరెక్టర్ ఎం.సరోజ మాట్లాడుతూ రైతులు పట్టు పురుగుల పెంపకంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

ప్రతి విద్యార్థీ ఉద్యోగం కల్పించే స్థాయికి ఎదగాలి


సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో అధికారులు, కళాశాల యాజమాన్యం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రతి విద్యార్థీ బాగా చదువుకుని భవిష్యత్‌లో ఉద్యోగం కల్పించే స్థాయికి ఎదగాలని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి ప్రదీప్‌కుమార్ తెలిపారు. చిత్తూరు నగరంలోని విజయం ఎంబీఏ కళాశాలలో శుక్రవారం స్టార్ట్ అప్ ఇండియా అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పెట్టుబడి అవకాశాలను కల్పిస్తున్నాయన్నారు. ఉన్నత విద్య పూర్తయ్యాక విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చైర్మన్ తేజోమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ఆశయంతో ముందుకు సాగాలన్నారు. సామాజిక మాధ్యమాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం మై భారత్ చిత్తూరు తరపున పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ హరీష్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సూరిబాబు, ప్రాంతీయ గణాంక అధికారి బాబురెడ్డి, సిబ్బంది రాజకుమారి, నిత్యానందం పాల్గొన్నారు.

పనితీరును మెరుగు పరుచుకోవాలి


మాట్లాడుతున్న ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ ఉద్యోగుల పనితీరును మరింత మెరుగు పరుచుకోవాలని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ ఆదేశించారు. ఆయన శుక్రవారం తన కార్యాలయంలో చిత్తూరు అర్బన్ డివిజన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవీఆర్ఎస్‌లో విద్యుత్ శాఖ పనితీరుపై ప్రజలు 60 శాతం మాత్రమే సంతృప్తిగా ఉన్నట్టు తేలిందన్నారు. సకాలంలో పనులు చేస్తూ వినియోగదారులతో స్నేహంగా ఉంటే ఇలాంటి ఫలితాలు రావన్నారు. బిల్లు కట్టనప్పుడు వారితో అమర్యాదగా మాట్లాడడం, సమస్యపై ఫిర్యాదు చేస్తే అతి చేయడం వంటివి చేయరాదన్నారు. ఈఈ మునిచంద్ర మాట్లాడుతూ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సకాలంలో పనులు చేయాలన్నారు. ట్రిప్పింగ్ సమస్యలు తగ్గించాలని తెలిపారు. స్థానికంగా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో విద్యుత్ గ్రీవెన్స్‌కు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. వ్యవసాయ సర్వీసులు పెండింగ్‌లో పెట్టుకోరాదన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఈఈ జగదీష్, డీఈలు ప్రసాద్, ఆనంద్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు హామీలతో మభ్యపెట్టిన కూటమి


క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

- బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీలో వైఎస్సార్ సీపీ నేతల విమర్శ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కూటమి ప్రభుత్వం తప్పుడు హామీలతో ప్రజలను మభ్యపెట్టిందని వైఎస్సార్‌సీపీ నేతలు విమర్శించారు. శుక్రవారం చిత్తూరు మండలం తుమ్మిందలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నేతలు మాట్లాడుతూ, కూటమి నాయకులు ఎన్నికల సమయంలో మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, ఆ తర్వాత వాటిని నెరవేర్చ లేదని విమర్శించారు. అరకొరగా పథకాలు అమలు చేయడం తప్పితే సంక్షేమానికి పూర్తిగా ఎసరు పెట్టిందని దుయ్యబట్టారు. దివ్యాంగులపై కనికరం లేకుండా పింఛన్లు తొలగిస్తూండటం ఇందుకు ఉదాహరణ అని చెప్పారు. ఈ ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే చంద్రబాబు మోసపూరిత హామీలను ఇంటింటికీ వెళ్లి తెలియజేస్తున్నామన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జయపాల్, జెడ్పీటీసీ ఎంఎస్.బాబు నాయుడు, వైస్ ఎంపీపీలు జయరాం, రంజని, వైఎస్సార్‌సీపీ నాయకులు సంపత్, అమర్‌నాథ్‌రెడ్డి, టి.కుమార్, ప్రతిమారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజేంద్ర, స్టాన్లీ, నాగేంద్ర, రాబర్ట్, మణిబాబుపిళ్లై, తులసి, ఏ.రాజేంద్ర, వెంకటేష్‌బాబు పాల్గొన్నారు.

మామిడి రైతుల జాబితాపై గ్రామసభ


రైతులకు వివరాలు తెలియజేస్తున్న అధికారులు

గుడిపాల: ఫ్యాక్టరీలకు మామిడి కాయలు తోలిన రైతుల వివరాలతో కూడిన జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని వ్యవసాయాధికారి సంగీత తెలిపారు. ఆమె శుక్రవారం వసంతాపురం సచివాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతుల వివరాలతో కూడిన జాబితాలను ఆయా రైతుసేవా కేంద్రాల్లో ఏర్పాటు చేశామన్నారు. వాటిని పరిశీలించి అభ్యంతరాలు ఉంటే తెలియజేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పేరు లేని రైతులు తగిన డాక్యుమెంట్లను రైతు సేవా కేంద్రాల్లో అందజేయాలని సూచించారు. రైతులు బ్యాంక్ ఖాతాకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలన్నారు. వారి బ్యాంక్ ఖాతాల్లోకి కిలోకు రూ.4 వంతున నిధులు జమ చేస్తామని తెలిపారు.

గురువులే విజ్ఞాన రథ సారథులు


మాట్లాడుతున్న గల్లా రామచంద్రనాయుడు

ఐరాల: నవ సమాజ నిర్మాణానికి బాటలు వేసే ఉపాధ్యాయులు విజ్ఞాన రథ సారథులని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, అమరరాజ చైర్మన్ గల్లా రామచంద్రనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల అసోసియేషన చేస్తున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. తొలుత పాఠశాల ఆవరణలోని సరస్వతిదేవి విగ్రహానికి పూజలు చేసి, మొక్కలు నాటారు. అనంతరం పాఠశాల, కళాశాల విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని, ఈ విద్యాసంవత్సరం నుంచి టెన్త్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచే ఇద్దరేసి చొప్పున విద్యార్థులు, విద్యార్థినులకు తమ అమరరాజా కళాశాలలో ఎంపీసీ గ్రూపులో నాలుగు సీట్లు ఉచితంగా ఇస్తామని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. హైస్కూలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని హెచ్ఎం వాసుదేవన్, ప్రిన్సిపల్ బీబేశ్వర్‌రెడ్డి ఆయనను కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు సీతాపతినాయుడు, ఉపాధ్యక్షుడు రాజేష్, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

జానపద కళలు నవ సమాజ చైతన్య రూపాలు


మాట్లాడుతున్న మన సంస్కృతి కళా సంస్థ అధ్యక్షుడు సహదేవనాయుడు

చిత్తూరు కలెక్టరేట్ : జానపద కళలు నవ సమాజ చైతన్య రూపాలని మన సంస్కృతి కళాసంస్థ అధ్యక్షుడు సహదేవనాయుడు, పీవీకేఎన్ ప్రిన్సిపాల్ జీవనజ్యోతి తెలిపారు. పీసీఆర్ ప్రభుత్వ జూనియర్, పీవీకేఎన్ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు శుక్రవారం జానపద కళలు, సంస్కృతిపై అవగాహన కల్పించారు. పీవీకేఎన్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జానపద కళలు పల్లె ప్రజల జీవన విధానానికి అద్దం పడతాయని తెలిపారు. నవ సమాజాన్ని చైతన్య పరిచేందుకు జానపద కళలు ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. మానసిక ఉల్లాసాన్ని కల్గించడంతోపాటు మానవ జీవితాన్ని ఆనందమయం చేస్తాయని పేర్కొన్నారు. జానపద కళాకారుడు రెడ్డెప్ప జానపద గేయాలను ఆలపించి విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో పీవీకేఎన్ కళాశాల కల్చరల్ కో ఆర్డినేటర్ జయచంద్రుడు, అధ్యాపకులు చెన్నకేశవులు, గోపీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్ల రద్దు దారుణం

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు జిల్లాలో అర్హులైన వికలాంగుల పింఛన్లు రద్దు చేయడం దారుణమని, ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు కోరారు. పుట్టుకతోనే వికలాంగులైన వారికి కూడా సర్టిఫికెట్స్ ఎలా మారిపోతాయని ప్రశ్నించారు. అలాంటి అధికారులపై చర్యలు తీసుకోకుండా వేలాది మంది పింఛన్లు రద్దు చేయడమేమిటని నిలదీశారు. ఇది ఉద్దేశపూర్వకంగానే చేస్తున్నట్టు అర్థమవుతోందని పేర్కొన్నారు. ఇటీవల వికలాంగులు కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలిపారని గుర్తు చేశారు. గత పాలకులపై కక్షను దివ్యాంగులపై చూపడం తగదని వెల్లడించారు. రాజకీయాలు పక్కన పెట్టి సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి వెంటనే పింఛన్లు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో వారికి మద్దతుగా సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు


రౌడీషీటర్లతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళెం: గ్రామాల్లో గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆయన శుక్రవారం రాత్రి బంగారుపాళెం పోలీసు స్టేషన్ పరిధిలో గల రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. నిమజ్జనం సందర్భంగా ఎక్కడైనా గొడవలకు దిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా నేరాలకు పాల్పడితే అటు వంటి వారిని జిల్లా నుంచి బహిష్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

పాలేరులో శ్రీకృష్ణుడి గ్రామోత్సవం



బంగారుపాళెం: మండలంలోని పాలేరులో శుక్రవారం మధ్యాహ్నం శ్రీకృష్ణ భగవానుడి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణజన్మాష్టమి కార్యక్రమంలో భాగంగా ఉదయం గ్రామానికి చెందిన ప్రబోధ సేవా సమితి–ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం ఈ కార్యక్రమం నిర్వహించారు. పల్లకిపై కొలువుదీర్చి గ్రామవీధుల్లో మేళతాళాలు, కోలాట ప్రదర్శనల నడుమ ఊరేగించారు. ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొని పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు కొబ్బరి కాయలు కొట్టి, కర్పూర నీరా జనాలు సమర్పించారు.

బోరు కేబుల్ వైర్ల చోరీ

చౌడేపల్లి: మండలంలోని కాగతి పంచాయతీ యనమసామనపల్లె, మర్రిమాకులపల్లె గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే బోర్లకు ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లు గురువారం రాత్రి చోరీకి గురయ్యాయి. శుక్రవారం బోరు వద్దకు వెళ్లిన సిబ్బంది చోరీని గుర్తించి సర్పంచ్ షంషీర్, పంచాయతీ కార్యదర్శి మొగిల్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. రెండు బోర్ల వద్ద సుమారు రూ.50 వేల విలువచేసే కేబుల్ వైర్లు చోరీకి గురైనట్టు తెలిపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు సర్పంచ్ తెలిపారు.

నోటీస్ బోర్డు

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు రాములు గుడివీధిలోని శ్రీ జైన్ సంఘ ప్రార్థనా మందిరంలో ఆదివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సుభాష్‌జైన్ తెలిపారు. ఎస్‌వి అరవింద్ ఐ ఆస్పత్రి వైద్యులు వైద్య పరీక్షలు చేస్తారని, దీనిని పట్టణ పరిసరాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు నగరంలో శనివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్థానిక 44వ డివిజన్ రంగచ్చారివీధిలోని ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో శనివారం ఉదయం 11 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. స్థానికులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని వివరించారు.

ఐరన్ మాత్రలు పంపిణీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగినులు, సిబ్బందికి ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తున్నామని డీఐఓ హనుమంతరావు చెప్పారు. చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం వైద్య ఉద్యోగినులు, సిబ్బందికి ఐరన్ మాత్రలు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 20–49 ఏళ్ల వారికి వారానికి ఒక్కరోజు ఐరన్ మాత్రలు మింగించాలని, తద్వారా రక్తహీనతను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ ప్రవీణ, వైద్యులు అనిల్‌కుమార్, రాజేశ్వరి పాల్గొన్నారు.

జర్నలిస్టు కాలనీలో సీసీ రోడ్లు వేయరూ!

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నగర పరిధిలోని మురకంబట్టు జర్నలిస్టుకాలనీలో సీసీ రోడ్లు వేయాలని సంబంధిత అధికారులను భారతీయ తెలుగు రచయితల సమాఖ్య జాతీయ గౌరవాధ్యక్షులు, సీనియర్ జర్నలిస్టు మర్రిపూడి దేవేంద్రరావు ఒక ప్రకటనలో కోరారు. 1999లో 25 మంది జర్నలిస్టులకు సర్వే నెంబరు 119లో స్థలాలను అప్పట్లో సీఎం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్కెట్ ధరకు జర్నలిస్టులకు పంపిణీ చేశారన్నారు. జర్నలిస్టు కాలనీకి రెండు ప్రధాన దారులు, మూడు అనుసంధాన దారులు ఉన్నాయని, కాలనీలో ఇళ్ల నిర్మాణం చేసుకోవాలంటే రోడ్లు అవసరమని విజ్ఞప్తి చేశారు.

చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

యాదమరి: రానున్న వినాయక చవితి పురస్కరించుకుని విగ్రహాల ఏర్పాటుకు ఉత్సవ నిర్వాహకులు పోలీసులు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్థానిక ఎస్ఐ ఈశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దీనికోసం గణేష్ ఉత్సవ్.నెట్‌లో వివరాలు నిక్షిప్తం చేయాలన్నారు. పోలీసులు వివరాలను పరిశీలించిన అనంతరం అనుమతి ఇస్తారని, ప్రశాంత వాతావరణలో వినాయకచవితి ఉత్సవాలు నిర్వహించుకోవాలని కోరారు.

ఇసుక అక్రమ రవాణాపై కేసు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఇసుక అక్రమ రవాణాపై బీఎన్ఆర్‌పేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. చిత్తూరు మండలం అనంతాపురం గ్రామం వద్ద అక్రమ ఇసుక లారీ గ్రామస్తులు కంట పడింది. దీంతో ఈ లారీని గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ నాగసౌజన్య ఈ లారీని అదుపులోకి తీసుకుని కేసు తిరువల్లూరు జిల్లాకు చెందిన సరసంథన్, పురుషోత్తం, నెల్లూరుకు చెందిన మహేష్‌రెడ్డిలపై కేసు నమోదు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

ఆక్రమిత దుకాణాలతో స్కూలుకు అవస్థలు

పూతలపట్టు(యాదమరి): చిత్తూరు–తిరుపతి జాతీయ రహదారికి అనుకుని ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల తరగతి గదులకు పక్కనే కొంతమంది వ్యాపారస్తులు అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేశారని పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నేతాజీ శుక్రవారం పూతలపట్టు సీఐ కృష్ణమోహన్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ, ఈ ఆక్రమిత దుకాణాలు విద్యార్థినుల మరుగుదొడ్లకు పక్కన ఉండడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని, అంతేకాకుండా ప్రతి మంగళవారం చేపలు ఇక్కడ విక్రయిస్తుండడంతో తరగతి గదుల్లోకి దుర్వాసన చిమ్ముతోందని, స్కూలు చుట్టూ అపరిశుభ్ర వాతావరణం కలుగుతోందన్నారు. ఆ దుకాణాలను వేరే ప్రదేశానికి మార్చేలా తగు చర్యలు తీసుకోవాలని సీఐను కోరారు.